నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్–11 కేవీ ఆజామ్‌బాద్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ విజయ్‌భాస్కర్ తెలిపారు. సాయిబాబా టెంపుల్ ఫీడర్ పరిధిలో బతుకమ్మ కుంట, వీహెచ్ హౌస్, సాయిబాబా ఆలయం, సీఈ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 12.30 వరకు విద్యుత్ ఉండదు. సీఈ కాలనీ ఫీడర్ పరిధిలో శివం, శారదానగర్, సాయిబాబానగర్, ఈ–సేవా, బాగ్ అంబర్‌పేట్ తదితర ప్రాంతాల్లో 2.30 నుంచి 4.30, బతుకమ్మ కుంట ఫీడర్ పరిధిలో పాముల బస్తీ, మల్లన్న ఆలయం, గంగానగర్, పోచమ్మ బస్తీ తదితర ప్రాంతాల్లో 3 గంటల నుంచి 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

‘రిజర్వేషన్స్’ అమలు చేయాలి


కృష్ణ స్వరూప్

కాచిగూడ: రాష్ట్ర హైకోర్టులో త్వరలో జరగనున్న గవర్నమెంట్ ప్లీడర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, ప్రభుత్వ శాఖల స్టాండింగ్ కౌన్సిల్, స్పెషల్ పబ్లిక్ ప్రాస్క్యూటర్ పదవుల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీలకు అవకాశాలు కల్పించాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం చైర్మన్, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్స్ అమలు చేయాలని, సోషల్ జస్టిస్ పాటించాలని ఆయన ఆదివారం ఒక ప్రకటన ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. నియామకాల్లో అవినీతి లేకుండా సిఫార్సులకు తావు లేకుండా చూడాలని కోరారు. గత కేసీఆర్ పాలనలోనూ పదవుల భర్తీలో ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులకు అన్యాయం జరిగిందని గుర్తుచేశారు.

గెలుపే లక్ష్యంగా..

వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించాలి


సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎల్.రమణ

బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ రమణ

ముషీరాబాద్: కార్యకర్తలే పార్టీకి బలమని ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని కషిష్ హాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు అధ్యక్షత వహించారు. ఎల్.రమణ మాట్లాడుతూ.. కార్యకర్తల అండదండలతో మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నగరంలో 23 స్థానాలలో బీఆర్ఎస్ విజయం సాధించిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నా లేకున్నా కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు మాగంటి గోపినాథ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. త్వరలో కమిటీలు వేసి సీనియర్లకు, తెలంగాణ ఉద్యమకారులకు, పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, మాజీ కార్పొరేటర్లు ముఠా పద్మ, మాచర్ల పద్మజ, పార్టీ సీనియర్‌నాయకులు బింగి నవీన్, ఆరు డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, శ్రీధర్ రెడ్డి, రాకేశ్, వల్లాల శ్యామ్‌యాదవ్, సురేందర్, పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్‌చారి, షరీఫ్, శివ ముదిరాజ్, ముక్తార్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మీ ఆశీర్వాదం ఉంటే..

‘రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మరోసారి ఎంపీగా నిలబడాలి అనుకుంటున్నా, నన్ను గెలిపిస్తారా... మీ ఆశీర్వాదం ఉంటే ఈ ఎన్నికల్లో తప్పనిసరిగా విజయం సాధిస్తా’ అని బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ అన్నారు. ఎంపీగా గెలిస్తేనే నిధులు వస్తాయని.. అప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు.

కార్యకర్తల సమావేశంలో దొంగల చేతివాటం

విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో దొంగలు చేతివాటం చూపారు. సమావేశం ముగిసిన అనంతరం ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మాగంటి గోపినాథ్, ఎమ్మెల్సీ రమణ, తలసాని సాయికిరణ్ యాదవ్‌తో పాటు నాయకులు ఫొటోలు దిగుతుండగా దొంగలు చోరీ చేశారు. ముగ్గురి సెల్‌ఫోన్‌లు, పార్టీ నాయకుడు బబ్లూ జేబులో నుంచి రూ.20 వేలు, యాదగిరి నుంచి రూ.14 వేలు, శ్రీనివాస్‌రావు దగ్గర రూ.3500 కొట్టేశారు. బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ఒక దొంగను పట్టుకొని ముషీరాబాద్ పోలీసులకు అప్పగించారు.

సమావేశానికి నాయకులు గైర్హాజరు

కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి అడిక్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ సునితా ప్రకాష్‌గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆర్.మోజెస్ సమావేశానికి గైర్హాజరయ్యారు. వారితో పాటు ఇటీవల కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన సంగిశెట్టి జగదీశ్‌రావు, నాగేశ్ ముదిరాజ్ సైతం సమావేశానికి రాకపోవడంతో చర్చనీయాంశంగా మారింది.

ఉద్యమకారులకు గుర్తింపు లేదు

బీఆర్ఎస్‌లో తెలంగాణ ఉద్యమకారులకు, పార్టీ సీనియర్ నాయకులకు గుర్తింపు లేదని బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ సభలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడే అగ్రనాయకులకు పార్టీ క్యాడర్ గుర్తు వస్తుందని, మిగతా సమయాలలో పట్టించుకోవట్లేదన్నారు. అయితే, ఎమ్మెల్యే ముఠా గోపాల్ కార్యకర్తలకు అండగా ఉండి.. వారి బాగోగులు చూస్తున్నారని గుర్తుచేశారు.

బుర్రవీణ వాయిద్య కళాకారుడికి సన్మానం


కొండప్పని సన్మానిస్తున్న చిన జీయర్‌స్వామి, మల్లు నందిని

చిక్కడపల్లి: ఇటీవల కేంద్రం ప్రకటించిన పద్మశ్రీ అవార్డు గ్రహీత, నారాయణపేట జిల్లాకు చెందిన బుర్రవీణ వాయిద్య కళాకారుడు దాసరి కొండప్పను శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, సతీమణి భట్టి నందిని ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆచార్య భగవత్ రామానుజులు పరిపుష్టం చేసిన దాన సంస్కృతి సంప్రదాయాల్లో బుర్ర వీణ వాయిద్యం ఒకటన్నారు. కొండప్పకు ఈ అవార్డు రావడం మొత్తం కళా ప్రపంచానికి అరుదైన గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు.

వైభవంగా సుందరకాండ కార్యసిద్ధి హోమం


హోమం నిర్వహిస్తున్న ఆలయ వేద పండితులు

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో అష్టోత్తర శత హనుమాన్ చాలీసా సహిత శ్రీమత్ సుందరకాండ హోమం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. తొలిరోజు నిర్వహించిన హోమంను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.దేవనాథం పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దాతలు మురికి గణేశ్, తమ్మన వేణు గోపాలరావు, అర్చకులు బుగ్గ లక్ష్మీపతి శర్మ, కందాల వెంకటాద్రి, ఎస్‌బీవీఎన్ ఆచార్య, భక్తులు పాల్గొన్నారు.

గోశాలకు పశుదాణా పంపిణీ


గోశాలకు పశుదాణా అందజేస్తున్న సభ్యులు

కాచిగూడ: జంతు సంరక్షణ పక్షోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పన్ ఆధ్వర్యంలో ఆదివారం భూలక్ష్మీ మాత గోశాలకు పశుదాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గోశాల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేశ్ అగర్వాల్ మాట్లాడుతూ.. అత్యధికంగా గోవుల వధ జరుగుతున్న ప్రాంతాల్లో భూకంపాలు వస్తున్నాయన్నారు. అందువల్ల గోవధ శాలలను వెంటనే మూసివేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్, ముంగి తదితర ప్రాంతాల్లో గోవధ విచ్చలవిడిగా జరుగుతోందని పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం న్యాల్‌కల్, ముంగి ప్రాంతాల్లో భూకంపం వచ్చినట్టు గుర్తుచేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహేందర్ గుప్తా, కార్యదర్శి నిర్మల్ కుమార్ జైన్, ప్రవీణ్ ఖండేల్‌వాల్, నీతా ఖండేల్ వాల్, ప్రేమ్‌చంద్ మునోద్, గోశాల ప్రతినిధి రవి పాల్గొన్నారు.

అలరించిన స్వీయ కవితలు


వెంకటదాసును సన్మానిస్తున్న పార్వతీశం

చిక్కడపల్లి: సాంఘీక సాహిత్య సాంస్కృతిక ఆధ్యాత్మిక సేవా సంస్థ కమలాకర ఛారిటబుల్ ట్రస్ట్, కమలాకర లలిత కళాభారతీ సంయుక్త ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ‘జయహో భారత్’ శీర్షికతో నిర్వహించిన కవి సమ్మేళనంలో కవులు, కవయిత్రులు పాల్గొని స్వీయ కవితలు చదివి ప్రేక్షకులను అలరించారు. ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖులు పోలీస్ శాఖలో సేవా తాత్పరతకు పెద్దూరి వెంకటదాసు, సాహితీ కిరణం సంపాదకులు సుబ్బారావు, గాయకులు సీహెచ్ త్రినాథరావు, రచయిత్రి కృష్ణకుమారి, కృష్ణవేణి, భారతీ కమలాకర్ పాల్గొన్నారు.

నేడు ఘంటసాల శత జయంతి

లిబర్టీ: గాన గాంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు శత జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ తెలిపారు. ఆదిలీలా ఫౌండేషన్ ఆళ్ల సాంబయ్య, చైతన్య భారతీ సంయుక్తంగా ఈ శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేడు ఉదయం 11.30 గంటలకు సైబర్ మెడిసీ సొసైటీ క్లబ్ హౌస్‌లో వేడుకలు ఉంటాయన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ప్రముఖ గాయకులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

నేడు ఓయూకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి నేడు (29న) ఓయూ క్యాంపస్‌కు రానున్నారు. ఖేలో ఇండియా నిధులతో ఏ– గ్రౌండ్‌లో నిర్మించిన సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌ను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, వీసీ ప్రొ.రవీందర్‌తో కలిసి ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

గద్దర్ విగ్రహ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

ఉస్మానియా యూనివర్సిటీ: సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో ఏర్పాటు చేయనున్న దివంగత నేత గద్దర్ విగ్రహ ఏర్పాటుకు మున్సిపాలిటీ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు విద్యార్థి నేతలు పేర్కొన్నారు. ఆదివారం ఏఐఎస్ఎఫ్ నెల్లి సత్య, ఆల్ మాల విద్యార్థి సంఘం (అంసా) ఓయూ అధ్యక్షులు నామ సైదులు, అధ్యాపకుడు డా. సుదర్శన్ తదితరులు తెల్లాపూర్‌లో కౌన్సిలర్ కొల్లూరి భరత్ ఆమరణ దీక్షలో పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ నెల 31న తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పరుగుల స్వామికి సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: మారథన్ రన్నర్ చిన్నపాక స్వామిని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సన్మానించారు. ఆదివారం స్టూడెంట్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 1000 రోజుల్లో 65000 కిలో మీటర్ల పరుగును పూర్తి చేసినందుకు సన్మానించినట్లు ఎస్ఎస్ఎఫ్ వ్యవస్థాపకులు సాగంటి రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, డా.శ్రీకాంత్, డా.కవిత, వేల్పుల సంజయ్, సతీష్, రమేష్ పాల్గొన్నారు.

‘మున్నూరు కాపు’ హాస్టల్ ఏర్పాటుకు కృషి చేయాలి


విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న హనుమంతరావు

కాచిగూడ: మున్నూరు కాపు బాలికల హాస్టల్ ఏర్పాటుకు కృషి చేయాలని సీనియర్ కాంగ్రెస్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు సూచించారు. మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాదం అంజయ్య హాల్‌లో ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రతిభ కనబర్చిన 300 మంది మున్నూరు కాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, సర్టిఫికెట్, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. ప్రతిభా పురస్కారాలు తీసుకున్నవారిలో మహిళలే అధికంగా ఉన్నారన్నారు. మహిళా విద్యను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థుల కోసం కోసం ప్రత్యేకంగా మున్నూరుకాపు బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. హాస్టల్ నిర్మాణం కోసం నిధులు ఇవ్వడానికి దాతలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి శాకెల్లి శాలిని, మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎం.ఆర్.వెంకట్‌రావు, ఆకుల వి.పాండురంగారావు, పిల్లి శ్రీనివాస్‌రావు, మంద సూర్యప్రకాశ్, నిమ్మ శంకర్, ఆకుల నాగేశ్, ఎలగందుల దేవేందర్, అమరం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మంత్రి పొన్నంతో మాట్లాడతా..

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు యువక మండలి ప్రధానకార్యదర్శి ఎస్.పి.క్రాంతికుమార్, ఉపాధ్యక్షుడు ఆది అవినాశ్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఆదివారం కాచిగూడలో హనుమంతరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ.. మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుపై రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడతానన్నారు. కుల గణనతో బీసీల అభివృద్ధి జరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్నూరుకాపు యువకమండలి నేతలు పాలమూరు రాజేశ్, ఎ.అరుణ్ కుమార్, జి.నవీన్ కుమార్, జిల్లా మనోజ్ కుమార్, ఏనుగుల సాయి కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు తిరుపతి ప్రసాదం అందజేత



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇటీవల ముషీరాబాద్ ఎమ్మెల్యేగా ముఠా గోపాల్ రెండోసారి భారీ మెజార్టీతో గెలుపొందడంతో బాగ్‌లింగంపల్లికి చెందిన మనోహర్‌రెడ్డి తిరుపతి వేంకటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆదివారం సుందరయ్య పార్కులో ఎమ్మెల్యే గోపాల్‌కు తిరుపతి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్కు అధ్యక్షుడు ఆర్.వివేక్, మాజీ అధ్యక్షుడు ఎస్.రమేశ్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, వి.నాగభూషణం, శైలజమోహన్, కృష్ణ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. ఆదివారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు ఆర్.వివేక్, ప్రధాన కార్యదర్శి పి.వెంకటస్వామిగౌడ్, మాజీ అధ్యక్షుడు ఎస్.రమేశ్‌రెడ్డి, మన్నె దామోదర్ రెడ్డి, శైలజమోహన్, వి.నాగభూషణం, మనోహర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, టైలర్ రాజు, పెంటారెడ్డి పాల్గొన్నారు.

సీఎం నిర్ణయంపై హర్షం


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

ముషీరాబాద్: కుల గణనతో పాటు బీసీల ఇతర డిమాండ్లను పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూల నిర్ణయం తీసుకోవడంపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, వివిధ బీసీ సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ లాల్‌కృష్ణ అధ్యక్షతన బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. కుల గణన, బీసీ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించడంతో పాటు స్కాలర్‌షిప్‌ల పెంపు, పార్లమెంటు నియోజకవర్గానికి ఒక బీసీ స్టడీ సర్కిల్ మంజూరు, ఫీజు బకాయిలు చెల్లింపులు–బకాయిలు లేకుండా గ్రీన్ ఛానల్‌లో పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ఇది గొప్ప చారిత్రత్మక నిర్ణయమని ప్రశంసించారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, రైల్వే, ఎల్ఐసీ, బీహెచ్ఈఎల్, బీడీఎల్, బ్యాంకింగ్, రక్షణ సంస్థలు, తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయరాదని.. ఈమేరకు అన్ని రాజకీయ పార్టీలు ఏకమై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. కార్యక్రమంలో లాల్‌కృష్ణ ప్రసాద్, భరత్‌కుమార్, సి.రాజేందర్, గుజ్జ కృష్ణయాదవ్, జి.అంజి, అనంతయ్య, శివకుమార్, రాందేవ్ మోడీ, రామాంజనేయులు, శివ, గోపి, పర్వతాలు, నర్సింహులు పాల్గొన్నారు.

దామాషా పద్ధతిన రిజర్వేషన్లు పెంచాలి


శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఉద్యోగుల సంఘం

కవాడిగూడ: దేశవ్యాప్తంగా ఓబీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, బీసీలకు విద్యా, ఉద్యోగాలలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం కవాడిగూడలోని ఎల్ఐసీ ప్రధాన కార్యాలయంలో ఓబీసీ ఉద్యోగుల సంఘం జాతీయ కార్యవర్గ సమావేశం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జాజుల మాట్లాడుతూ.. దేశంలో ఏ రిజర్వేషన్‌కు, ఏ వర్గానికి లేని క్రిమిలేయర్‌ను బీసీలపై బలవంతంగా విధించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా బీసీ కులగణన నిర్వహించి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఓబీసీ ఉద్యోగులను గుర్తించి.. వారికి పోస్టింగ్‌లు, ప్రమోషన్లలో న్యాయం చేయాలని కోరారు. ఆల్ ఇండియా ఎల్ఐసీ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు యోగేంద్ర చౌదరి, అశోక్‌కుమార్ మాట్లాడుతూ... భీమారంగ సంస్థలో ఓబీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, రాయితీలు, హక్కుల సాధన కోసం బీసీ సంక్షేమ సంఘంతో కలిసి పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘం నాయకులు నాగరాజేశం తదితరులున్నారు.

‘పాత పెన్షన్ అమలయ్యేలా కృషి’


కోదండరామ్‌ని కలిసిన చంద్రశేఖర్, కృష్ణమూర్తి

చిక్కడపల్లి: సాధ్యమైనంత త్వరగా ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. పాత పెన్షన్ సాధన సమితి అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, కోర్డినేటర్ కృష్ణమూర్తి ఆదివారం కోదండరామ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

‘చైతన్య వేదిక’ కేలండర్ ఆవిష్కరణ



చిక్కడపల్లి: బీసీ, ఎస్సీ, ఎస్టీ చైతన్యవేదిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బోనం బన్నీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను అశోక్‌నగర్‌లోని ప్రముఖ స్వతంత్ర్య సమర యోధుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బోనం ఊర్మిళ, గ్రేటర్ యువజన విభాగం అధ్యక్షుడు ఎం.శ్రావణ్‌కుమార్, నేతలు ఎ.వినయ్‌కుమార్, ముఠా జైసింహ, రాకేశ్, అనిల్‌కుమార్, భాస్కర్, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

‘ఆమ్ ఆద్మీ’ ఇన్‌చార్జిగా దిలీప్ పాండే

లిబర్టీ: ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జిగా ఢిల్లీకి చెందిన ఎమ్మెల్యే దిలీప్ పాండేను నియమించినట్లు ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జిగా ఉన్న సోమనాథ్ భారతీ స్థానంలో దిలీప్ పాండే నియమితులయ్యారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న గీతామూర్తి

కాచిగూడ: జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా మహిళల్లోని ఆత్మవిశ్వాసమే ముందుకు నడిపిస్తోందని బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కె.గీతామూర్తి అన్నారు. ఆదివారం కాచిగూడలోని జాగృతి భవన్‌లో జరిగిన ఆర్ఎస్ఎస్ బర్కత్‌పుర విభాగ్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మహిళా శక్తి సమ్మేళన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గీతామూర్తి మాట్లాడుతూ.. మహిళలు తమ కుటుంబాన్ని మాత్రమే కాకుండా దేశాన్ని కాపాడే శక్తులుగా తయారవ్వాలని పిలుపునిచ్చారు. సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమైందని అన్నారు. నేటి ఆధునిక సమాజంలోనూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, వైవాహిక బంధం విజయంతంగా కొనసాగడంలో భారతీయ మహిళలు ముఖ్య భూమిక పోషిస్తున్నారని అన్నారు. మహిళల్లో నాయకత్వ పటిమ, నిర్ణయ సామర్థ్యం పెంపొందించి వారిని సర్వశక్తివంతులు, స్వతంత్రులుగా తీర్చిదిద్దడమే ఈ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ మహిళా ప్రతినిధులు, బీజేపీ మహిళా నేతలు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో నిర్లక్ష్యం తగదు


వైద్య పరీక్షలు చేస్తున్న మెడికవర్ వైద్య సిబ్బంది

కాచిగూడ: ప్రజలు ఆరోగ్య సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి ఏడెల్లి అజయ్ కుమార్ అన్నారు. ఆదివారం కాచిగూడ, సుందర్‌నగర్‌లోని భవసార్ భవన్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. నిర్లక్ష్యం, అవగాహన లోపం కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. మూడు నెలలకు ఒకసారి ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దళిత రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షుడు సర్వదాస్, కృష్ణ, నవీన్, కార్తీక్, కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో..

మెడికవర్స్ హాస్పిటల్ బేగంపేట బ్రాంచి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మేగా వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. బీపీ, సుగర్, బాడీమాస్ ఇండెక్స్, ఈసీజీ తదితర వైద్య సేవలు అందించారు. వివిధ విభాగాల ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొని రోగులకు వైద్య సేవలు, సలహాలు అందించారు. మాజీ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్, హాస్పిటల్ బ్రాంచ్ హెడ్ రాజ్‌కుమార్, సెంటర్ మేనేజర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యా ఎమర్జెన్సీ విధించాలి



మాట్లాడుతున్న లింగమల్లు యాదవ్

పంజగుట్ట: రాష్ట్రంలో తక్షణమే విద్యా ఎమర్జెన్సీ విధించి ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ధర్మ టీచర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని కోరింది. అభివృద్ధి చెందుతున్న దశలో కూడా ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు లేకపోవడం బాధాకరమని సభ్యులు ఆవేదన చెందారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ధర్మ టీచర్స్ యూనియన్(డీటీయూ) రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లు యాదవ్, ప్రధాన కార్యర్శులు డి.ఉపేందర్, కె.రాజు, బి.సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం నూతన ఉపాధ్యాయ సంఘ ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ఉపాధ్యాయ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల గొంతు వినిపించేందుకే తమ సంఘం ఆవిర్భవించిందని చెప్పారు. కార్యవర్గ అధ్యక్షుడిగా పాక లింగమల్లు యాదవ్, ప్రధానకార్యదర్శులు డి.ఉపేందర్, కె.రాజు, బి.సుధాకర్, గౌరవ సలహాదారుడు డాక్టర్ కొండ ఆశన్న, ఉపాధ్యక్షుడు పి.అశోక్, ఎస్.రమేశ్, కోశాధికారి పి.జనార్దన్, రాష్ట్ర కార్యదర్శులు టి.హరికిషన్, ఎమ్.శంకర్, బి.సాంబయ్య, ఎస్.నాగరాణి, సి.రవిచంద్రన్, ఇతర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

వినయ్‌కుమార్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ విద్య కళాశాల (బీఈడీ కాలేజీ) పరిశోధన విద్యార్థి బొడ్డు వినయ్‌కుమార్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.రవీంద్రనాథ్ కే.మూర్తి పర్యవేక్షణలో సర్టెన్ ఫాక్టర్స్ రిలేటెడ్ టు స్టూడెంట్ ఎంగేజ్‌మెంట్–ఎ స్టడీ ఎమాంగ్ సీనియర్ సెకండరీ స్కూల్ స్టూడెంట్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.